# ఆమె ఎంపిక



*కింకింను రోచతేతే*
*ముగ్ధాయా ఇతి సఖీభిపృష్టాయాః*
*ప్రథమోద్గత దోహదిన్యాః*
*దయితంప్రతి కేవలం గతా దృష్టిః*

***భావం:*** తొలిసారి గర్భవతి అయిన స్త్రీని నీకేం కావాలని స్నేహితురాళ్ళందరూ అడగగా ఆ ముద్దరాలి దృష్టి ప్రియమైన భర్త మీదకు మాత్రమే పోయింది.

గర్భవతి అయిన స్త్రీ ఆనందంగా ఉంటేనే ఆమెకడుపులో ఉన్న బిడ్డ ఆరోగ్యం బాగుంటుంది అన్నది వైద్యులు నొక్కి చెప్పే విషయం. గర్భిణిని ఆనందంగా ఉంచడానికి ఆమె బంధువులు ఆమె కోసం ఉత్సవాలు చేస్తారు. అందులో ముఖ్యమైంది సీమంతం. ఇందులో వైదికమైన కర్మ జరిపే సంప్రదాయం కూడా పూర్వం ఉండేది. ప్రస్తుతం ఆమెకు పూలజడ కుట్టి చేతినిండా గాజులు తొడిగే కార్యక్రమం మిగిలింది. ఆ సమయంలో బంధుమిత్రులందరూ ఆమెకు చీరలు, నగలు, పిండివంటలు ఇతర బహుమతులు ఇచ్చి ఆమెను సంతోషపెట్టడం అసలైన సంప్రదాయం. పాశ్చాత్య దేశాలలో కూడా మన సీమంతం వంటిదే బేబీషవర్ అనే పేరుతో ప్రథమ గర్భాన్ని పండుగలా చేస్తారు.

గర్భవతి ఆనందం సంగతి మరచిపోయి అమ్మాయి తరపు వారు మర్యాదలూ సారే పెట్టుపోతలూ సరిగా జరపలేదని అత్తగారూ ఆడబడుచులూ అలిగే అనవాయితీ మిగలడం దురదృష్టం.

ప్రాచీన కాలంలో సీమంతోత్సవం అత్తగారింట్లోనే జరిగేది. అందరమ్మాయిలలాగానే భానుమతికి సీమంతం జరిగింది. ఆమె పుట్టింటి బంధువులూ, అత్తింటి బంధువులూ ఆమెకు చీరలూ, నగలూ ఇతర బహుమతులూ ఇచ్చారు. ఆమె స్నేహితురాళ్ళకి ఆమెకు ఏ కానుకలివ్వాలో తెలియలేదు. ఆమెను అడిగి ఆమె కోరినవే కొనిద్దామనుకున్నారు.

"భానుమతీ నీకు ఏం కావాలో మాకు తెలియదు. ఏం కొనివ్వమంటావు? "

" కంచి నుంచి పట్టుచీర తెప్పించమంటావా?"

"కర్ణాటక దేశం నుంచి వజ్రాల కమ్మలు కావాలా?"

"ప్రతిదినం మిఠాయి మీ ఇంటికి వచ్చేలా ఏర్పాటు చేయాలా?"

స్నేహితురాళ్ళందరూ భానుమతిని ఏం కావాలని అడుగుతున్నారు.

ఆమె మౌనంగా ఉంది. ఆమె ఏ ప్రశ్నకు అవును అని కానీ కాదు అని కానీ  చెప్పకపోవడంతో వారు ఒక క్షణం ఆగారు. ఆమె దృష్టి భర్త మీద నిలిచి ఉంది. ఆ దృష్టిలో ప్రేమానురాగాలు తనను తల్లిని చేస్తున్నందుకు అభిమానం కదలాడుతున్నాయి. భర్త సన్నిధి తప్ప తనకు ఏ కోరిక లేదన్నట్లు ఆమె చూపులు ఉన్నాయి.

స్నేహితురాళ్ళలో వివాహం అయి పిల్లల తల్లులైన వారున్నారు. వారందరికీ నవ్వు వచ్చింది. ప్రథమంగా గర్భం దాల్చిన భానుమతికి ప్రసవవేదన అంటే తెలియదు. బిడ్డ పుట్టాక కలిగే నీరసం గురించి తెలియదు. బిడ్డను పెంచడం కోసం ఇతర వ్యాపకాలన్నీ వదులుకోవడంలోని నిర్వేదం తెలియదు. అందుకే ఆమెలో తల్లి కాబోతున్న ఆనందం తమ వలపు పంటగా బిడ్డనిస్తున్న భర్తపై అనురాగము మాత్రమే ఉన్నాయి. రేపు ప్రసవ సమయంలో బాధపడుతున్నప్పుడు ఇంత ప్రేమ కురిపిస్తుందా?

నవ్వు వచ్చిన స్నేహితురాళ్ళకి ప్రసూతి వైరాగ్యం క్షణికమన్న సంగతి గుర్తుకు వచ్చింది. ప్రేమ కురిపించి కడుపు పంట పండించే భర్త సన్నిధి కన్నా గర్భవతికి ఆనందం వేరే ఏముంటుంది?

భానుమతికి ఆమె భర్త సాన్నిహిత్యం కల్పించడానికి వారందరూ లేచి వెళ్ళి పోయారు.

సంబరాలతో అలిసిపోయిన భానుమతి భర్త ఒడిలో తలపెట్టుకుని నిద్రపోయింది. ఆమె కోరుకున్న బహుమతి దొరికింది.

******